క్లుప్తంగా

దైవచింతనతో మానసిక ప్రశాంతత



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో గల శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో, తలకొండపల్లి మండలంలోని రామకృష్ణాపూరంలో ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు తలసాని వెంకట్‌రెడ్డి, కమ్మెకర్ నవీన్‌కుమార్, అల్వాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

మొయినాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం నేతలు కేబుల్ రాజు, కుమ్మరి రమేశ్ డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదినెలలు అవుతున్నా ఉద్యమకారుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని.. 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. లేదంటే మరోసారి ఉద్యమించాల్సి వస్తుందన్నారు.

హైడ్రా పేరుతో పేదలకు అన్యాయం

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో నిరుపేదలకు అన్యాయం చేస్తోందని బీజేపీ యువ నాయకుడు కుమ్మరి మహేశ్ అన్నారు. హైడ్రా పేరుతో జరుగుతున్న కూల్చివేతలపై పలు అనుమానాలు ఉన్నాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పూర్తిస్థాయిలో నిజాలను తెలుసుకున్న తర్వాతే కట్టడాలను కూల్చివేయాలన్నారు. అనుమతుల పేరుతో గతంలో ఉన్న పర్మిషన్లను కాదని కూల్చివేతలు నిర్వహించడం అన్యాయమనిని, హైడ్రా నిరుపేదల ఇళ్లకే పరిమితమైందన్నారు. పెద్దలను కాపాడుతూ నిరుపేదల ఆస్తులను మాత్రమే ధ్వంసం చేయడం సరికాదన్నారు. పేదల కోసం పోరాడుతామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నిరుపేదలకు అన్యాయం చేస్తోందన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కేశంపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలోని కేజీబీవీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిత అవసరమైన విద్యార్థులకు మందులను అందించి, తగిన సలహాలను ఇచ్చారు. ఈ క్యాంపులో 316 మంది విద్యార్థులను పరీక్షించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ గౌసియాబేగం, పిహెచ్ఎన్ అంజలమ్మ, సూపర్‌వైజర్ మెరిసిలిన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొందుర్గు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ మాట్లాడుతూ.. 506 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామని, ఇందులో 45 మంది వరకు దగ్గు, జలుబు తదితర స్వల్ప అస్వస్థతకు గురయ్యారన్నారు. వారికి మందులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి కుర్షీద్, సీహెచ్ఓ శ్రీనివాస్, హెచ్ఈఓ మున్వర్, ఎంపీహెచ్ఏ సుజాన్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మండల ప్రత్యేకాధికారి రాజారత్నం

కేశంపేట: హాస్టల్‌లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడికల్ సిబ్బంది సహకారంతో క్యాంపును నిర్వహించి విద్యార్థులను పరీక్షించాలని ఆయన వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జగన్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

- పునాది దశలోనే నిలిచిన వెంకిర్యాల వంతెన నిర్మాణ పనులు
- ముందే హెచ్చరించినా స్పందించని అధికారులు
- వరదనీటితో స్తంభించిన జనజీవనం
- వాగును పరిశీలించిన తహసీల్దార్

కొందుర్గు: వర్షాలు కురిస్తే వాగు ప్రవాహానికి రాకపోకలు బంద్ అవుతాయని 'సాక్షి' 2024 మే 27న వంతెన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో? అంటూ కథనంతో హెచ్చరించినా అధికారులు స్పందించలేదు. తీరా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వెంకిర్యాల వాగులో వరదనీరు ప్రవహించడంతో శనివారం రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న వెంకిర్యాల వంతెన శిథిలావస్థకు చేరడంతో ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2023లోనే ఎఫ్‌డీఆర్ నిధుల్లో నుంచి రూ.3.20లక్షలు మంజూరు చేసింది. పనులకు టెండర్ పూర్తయ్యింది. అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 2023 జూన్ 23న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణానికి పునాదులు తీసి ఏడాది గడిచింది. అయినా ప్రస్తుతం వంతెన నిర్మాణం పునాదులకే పరిమితంగా మారింది. కాగా నూతనంగా వంతెన నిర్మించడానికి పాత వంతెనను తొలగించారు. ఈ సందర్భంగా శుక్రవారం కురిసిన వర్షానికి వాగులో వరదనీరు రావడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఆటంకం ఏర్పడింది. దీంతో కొందుర్గు మండలంలోని వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మిదేవిపల్లితో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల తదితర గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందిగా మారింది. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల ప్రజలు మహబూబ్‌నగర్ వెళ్లడానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



వెంకిర్యాల వాగు ప్రవాహం



రాకపోకలు నిలిచిపోయాయి



వంతెన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాత వంతెనను తొలగించారు. కొత్త వంతెన నిర్మాణం చేపట్టలేదు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు.

–లింగంగౌడ్, మాజీ సర్పంచ్, వెంకిర్యాల

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

గతంలో కాంట్రాక్టర్ జాప్యంతో కొంతవరకు పనులు కాలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వంతెన నిర్మాణం చేయడానికి అనుకూలించడం లేదు. వర్షాలు తగ్గిన అనంతరం వంతెన పనులు చేపడుతాం.

–రవీందర్ కుమార్, ఆర్అండ్‌బీడీఈ, షాద్‌నగర్

వాగులు దాటేందుకు ప్రయత్నించొద్దు



వర్షాకాలంలో వాగులు దాటేందుకు ఎవరూ ప్రయత్నించొద్దు. వరద ఉధృతికి అందులో కొట్టుకుపోయి ప్రమాదాల బారినపడే పరిస్థితి ఉంది. వాగు పరిసర ప్రాంతాలకు వెళ్లకూడదు.

–రమేశ్‌కుమార్, తహసీల్దార్, కొందుర్గు

ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి..

- ఇలాగైతే ఉండేదెలా అంటూ కొందుర్గు వాల్మీకి కాలనీవాసుల ఆవేదన
- తమ సమస్య తీర్చాలని వినతి

కొందుర్గు: మండల కేంద్ర శివారులో ఉన్న మాలకుంట వర్షపునీటితో నిండి వర్షపునీటితో పాటు మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నాయని కొందుర్గు బోయ వాల్మీకి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాలకుంట నిండితే వ్యవసాయ పొలాల్లో నుంచి నీళ్ల వెళ్లి వాగులో కలిసేవని, ప్రస్తుతం అడ్డు కట్టలు వేయడంతో మాలకుంట నీళ్ల ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. ఈ వరదనీటిలో మురుగునీరు కలిసి ఇళ్లలోకి రావడంతో దుర్వాసన వస్తుందని, ఇళ్లలో ఉండటానికి కూడా వీలు లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని వృద్ధురాలు బాలకిష్టమ్మ ఇంటిలో నిండ నీళ్ల చేరడంతో ఆమె పక్కింటిలో తలదాచుకుందన్నారు. కాలనీలోని మల్లేశ్, పల్లవి, చిన్నయ్య తదితర ఇళ్లలోకి వరదనీరు వచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ వరదనీరు ఇలాగే వస్తే తమ ఇళ్లు శిథిలం కావడం ఖాయమని, ఈ విషయాన్ని ఇదివరకే అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



కొందుర్గు మాలకుంట నుంచి ఇళ్లలోకి వస్తున్న వరదనీరు





ఇంట్లోకి చేరిన వరద నీటిని చూపుతున్న చిన్నయ్య

నీళ్లు రావడంతో వీధుల్లో నడవలేకపోతున్న కాలనీవాసులు

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై అధికారులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దళిత, గిరిజన ఆవాసాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని వందశాతం అమలు చేసేందుకు ప్రస్తుతం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. 250 మంది జనాభా ఉన్న అన్ని నివాసాలను, తండాలను బీటీ రోడ్లతో అనుసంధానించడానికి అధికారులు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. సమావేశంలో బాబునాయక్, మంగులాల్‌నాయక్, శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

షాబాద్: మండల పరిధిలోని మాచన్‌పల్లిలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ కార్య నిర్వాహక కమిటీ సభ్యులు తలారి సత్తయ్య, కోళ్ల యాదయ్య పిలుపునిచ్చారు. శనివారం మాచన్‌పల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

హనుమంతుడికి ప్రత్యేక పూజలు



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన తుంగలి రామచంద్ర యాదవ్, మంజుల దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, వసంతరావు, రఘుగౌడ్, రమేశ్‌ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్‌నాయక్, రాఘవేందర్, నర్సింలు, శ్రీనివాస్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

మండల వ్యవసాయ అధికారి అనురాధ



కొందుర్గు: రైతుల వివరాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



అజీజ్‌నగర్‌లో రైతుల వివరాలను ఫోన్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్న అధికారి అనురాధ

మొయినాబాద్‌రూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకుంటుందని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. అజీజ్‌నగర్, బాకారం, కేతిరెడ్డిపల్లి ఆయా గ్రామాల్లో వ్యవసాయ అధికారి రుణమాఫీ కాని వారి కుటుంబ నిర్ధారణ ఆధార్ కార్డు అప్‌లోడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణమాఫీ జరగని రైతులు ఆందోళన చెందొద్దని అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేయడానికి అధికారులు గ్రామాలకు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఏఓలు, రైతులు కొత్త జైపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై సర్వే

కొందుర్గు: రుణమాఫీ అందలేదని రైతులెవరూ దిగులు చెందొద్దని, అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం అందించే రుణమాఫీ అందుతుందని ఏఓ శోభారాణి సూచించారు. శనివారం ఆమె మండలంలోని పర్వతాపూర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన సమయంలో రుణం తీసుకున్న ప్రతీ కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వాసవి, నాయకులు మల్లేశ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



శేఖర్ దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, తదితరులు

కొత్తూరు: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని కొత్తూరు మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆఫీస్ సబార్డినేట్ శేఖర్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు పలువురు నాయకులు, అధికారులు శేఖర్ దంపతులను శాలువాలతో సన్మానించారు. మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సుఖశాంతులతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఏఈ గోపాల్, పీఆర్ఏఈ హేమంత్, నాయకులు అంబటి ప్రభాకర్, మోడి దర్శన్, రాజుగౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వరం కల్యాణలక్ష్మి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

శంకర్‌పల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి మహిళలకు వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీ, మండలానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకయ్య పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- పలు చోట్ల నిలిచిపోయిన రాకపోకలు

షాద్‌నగర్‌రూరల్: శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగు సమీపంలోకి ఎవరూ రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. పలు వాగుల వద్ద రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షానికి అయ్యవారిపల్లి సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. వాగు ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అనిల్ వాగువద్ద రక్షణ చర్యలు చేపట్టారు. అయ్యవారిపల్లి వెళ్లేవారు, వాగును దాటేవారు ఇక్కడకు రావొద్దని, మరొక మార్గం మీదుగా వెళ్లాలని సూచించారు.

నిండుగా పారుతున్న ఈసీ వాగు

షాబాద్: మండలంలో కురిసిన వర్షానికి ఈసీ వాగు పొంగిపొర్లుతోంది. మండల పరిధిలోని నాగరగూడ, తిమ్మారెడ్డిగూడ, ఏట్టఎర్రవల్లి, తాళ్లపల్లి, హైతాబాద్, సోలీపేట్ గ్రామాల సరిహద్దు నుంచి వెళ్లే ఈ వాగులోకి నీళ్ల రావడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. దీంతో గ్రామాల్లోని బోరుబావుల్లోకి పుష్కలంగా నీరు చేరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈసీ వాగులో వరద.. చెరువుకు మాత్రం చేరలే

మొయినాబాద్: ఎట్టకేలకు ఈసీ వాగులో వరద పారింది. ఈసీ వాగు ఎగువ ప్రాంతాలైన వికారాబాద్ జిల్లా పూడూరు, పరిగి, రంగారెడ్డి జిల్లా షాబాద్, చేవెళ్ల మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షం పడుతుండడంతో శనివారం ఉదయం చేవెళ్ల మండలం దేవరంపల్లి వద్ద ఈసీ వాగులో వరద మొదలైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు మొయినాబాద్ మండలం నక్కలపల్లికి చేరిన ఈసీవాగు వరద సాయంత్రం 5 గంటలకు వెంకటాపూర్ కత్వలోకి చేరింది. రాత్రి 7 గంటలకు వెంకటాపూర్ వంతెన దాటిన ఈసీ వాగు వరద హిమాయత్‌సాగర్ చెరువులోకి మాత్రం చేరలేదు.

కుంటను తలపిస్తున్న రహదారి

మొయినాబాద్‌రూరల్: శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన వర్షానికి మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో హైదరాబాద్–బీజాపూర్ రోడ్డుపై వర్షంనీరు భారీగా చేరి కుంటను తలపిస్తోంది. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిల్వకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.



షాద్‌నగర్‌రూరల్: అయ్యవారిపల్లి వాగును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి అనిల్



షాబాద్: నాగర్‌గూడ వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ చౌరస్తాలో నిలిచిన వర్షం నీరు



మొయినాబాద్: వెంకటాపూర్ వద్ద ఈసీ వాగులో పారుతున్న వరద

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఖాజాపాషాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేవెళ్ల: ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంతో ఉన్నతమైనదని ఉపాధ్యాయులను గౌరవించి పూజించటం మన సంప్రదాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని వీరయ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం చేవెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఖాజాపాష పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువులేనిది విద్యలేదనే మాట అందరూ గుర్తుంచుకోవాలన్నారు. చదువునేర్పించిన గురువును ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ప్రతీ ఉద్యోగికి సహజమన్నారు. పదవీ విరమణ పొందిన ఖాజాపాష శేష జీవితం ఆయురారోగ్యాలతో కుటుంబంతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పదవీ విరమణ పొందిన ఖాజాపాషాను ఘనంగా సన్మానించారు. ఆయనతో వున్న అనుబంధాలను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులుగా ఆయన చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బి.శైలజ కాంగ్రెస్ నాయకురాలు సమత, నాయకులు వసంతం, వీరేందర్ రెడ్డి, ఆగిరెడ్డి, టీకుపల్లి శ్రీను, పలు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, పోచయ్య, చెన్నయ్య, హన్మంత్‌రెడ్డి, చేవెళ్ల మండల విద్యాధికారి అక్బర్, మొయినాబాద్ ఎంఈఓ వెంకటయ్య, జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.